క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోవింద నామస్మరణ



గోవింద నామస్మరణ చేస్తూ భజనలు చేస్తున్న శ్రీ సీతారామాంజనేయ భజన బృందం

గంగాధర నెల్లూరు : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని జీడీ నెల్లూరులో పలువురు భక్తులు భక్తిశ్రద్ధలతో గోవింద నామ స్మరణ భజనలు చేశారు. గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో శ్రీరామ, గోవింద నామ సంకీర్తనలు ఆలపిస్తూ, గరుడ స్తంభం వెలిగించి, భజనలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించడానికి పూర్వం మార్గశిర మాసంలో విష్ణు నామ జపం చేసేవారని పెద్దలు చెప్పారు. సంక్రాంతి పండుగ రోజు వరకు నిత్యం ఉదయం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని భజన బృందం తెలిపింది.

రోడ్డుపై గుంతలను పూడ్చిన కాలనీవాసులు



గుంతలకు మట్టి పోస్తున్న స్థానికులు

నింద్ర: మండలంలోని నెట్టేరి ఎస్టీకాలనీ దగ్గర నగరి–నాగలాపురం రోడ్డు గుంతలతో నిండిపోయింది. దీంతో నిత్యం తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు మాత్రం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి బైక్‌పై వెళుతున్న అనంతప్పనాయుడు కంద్రిగకు చెందిన దివాకర్ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో స్పందించిన కాలనీవాసులు కలిసికట్టుగా శ్రమించి బుధవారం రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చేందుకు శ్రమించారు. అయితే ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

మనశ్శాంతి, ప్రశాంతత, మంచి వాతావరణం కోసం ఆలయాలకు వస్తుంటే వాటి సంగతి ఏమిటో గానీ కొత్త కష్టాలు వచ్చి పడుతున్నాయని భక్తులు వాపోతున్నారు. ఆలయాన్ని నిర్ణీత సమయానికి తెరవకపోవడం, ఆలయాల్లో దుర్గంధం, తీర్థం కోసం ప్రార్థించాల్సి రావడం, రెప్పపాటుతో ముగించే హారతి వంటి సమస్యలతో భక్తులు మనోవేదనకు గురవుతున్నారు.

శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయం



శివ శివా.. ముక్కు మూసుకుని ప్రదక్షిణలు

- అధ్వానంగా ఆలయాల నిర్వహణ
- పాలకమండలి లేని ఆలయాలు
- దుర్గంధం వెదజల్లుతున్న ఈశ్వరాలయం
- అర్చకుడు లేని ఆరేటమ్మ ఆలయం
- హుండీ లెక్కింపులకే పరిమితమైన అధికారులు

పుత్తూరు: పట్టణంలోని ఆలయాలు అధ్వానంగా మారి, భక్తులకు మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వర స్వామి ఆలయం, గ్రామదేవత ఆరేటమ్మ, శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి, శ్రీకోదండ రామస్వామి ఆలయాలు అభివృద్ధి పథాన పయనించాయి. గత ప్రభుత్వంలో అన్ని ఆలయాలకు పాలకమండళ్లు ఏర్పాటు చేసి, ఆలయ కమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. భక్తులకు అన్ని సౌకర్యాలతో దైవ దర్శనం ప్రశాంతంగా అయ్యేది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని ఆలయాల నిర్వహణ గాలిలో దీపంలా తయారైంది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడు నెలలు గడచినా నూతన పాలకమండళ్లు ఏర్పాటు చేయకపోవడంతో ఆలయాల అభివృద్ధి కుంటుపడింది. భక్తులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ అభిషేక ద్రవ్యాలు ఆలయ ఆవరణలోని భూగర్భ ట్యాంకులోకి వెళ్తాయి. ప్రస్తుతం ఆ ట్యాంకు నిండిపోయి, బయటే వ్యర్థాలు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. పరిశుభ్రత లోపించి దుర్గంధం వెదజల్లుతుంటే భక్తులు ముక్కులు మూసుకొని ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. దోమలు పెరిగిపోయి ఆలయానికి వచ్చే భక్తులు, పిల్లలపై దాడిచేస్తున్నాయి. అసలే పట్టణంలో జ్వరాల వ్యాప్తి అధికంగా ఉండడంతో ఆలయంలోని దుస్థితిని చూసి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏడాదిగా అర్చకులేరీ?

గ్రామదేవత ఆరేటమ్మ ఆలయంలో గత ఏడాదిగా అర్చకుడు లేకనే ధూపదీప నైవేద్యం కొనసాగుతోంది. గతంలో ఇక్కడ పూజారిగా పనిచేసిన రత్నం ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు అధికారికంగా పూజారిని అధికారులు నియమించలేదు. ఆయన సమీప బంధువులైన ఇద్దరు మహిళలు పూజారులుగా వ్యవహరిస్తున్నారు. వీరు ఆలయాన్ని నిర్ణీత సమయానికి తెరవడంలేదని, వచ్చిన భక్తులకు తీర్థం ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఆరేటమ్మ ఆలయంలో పూజరిని నియమించాలని భక్తులు కోరుతున్నారు. గత సోమవారం టెంపుల్ ఇన్‌స్పెక్టర్, ఈఓల సమక్షంలో హుండీలోని కానుకలను లెక్కించగా ఈశ్వరాలయం నుంచి రూ.2.86 లక్షలు, ఆరేటమ్మ ఆలయం నుంచి రూ.1.20 లక్షలు కలిపి మొత్తం రూ.4.06 లక్షల ఆదాయం వచ్చింది. కానుకలు అందుకున్న అధికారులు భక్తుల సౌకర్యాలను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇన్‌స్పెక్టర్ రాక.. పోక

అరు నెలలకోసారి స్థానిక ఆలయాల్లో నిర్వహిస్తున్న హుండీ కానుకల లెక్కింపు సమయంలో, శ్రీద్రౌపదీ దేవి సమేత శ్రీధర్మరాజులస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వేసే వేలం పాటలప్పుడు మాత్రమే ఉమ్మడి చిత్తూరు జిల్లా టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ఇక్కడికి ఇలా వచ్చి అలా వెళుతుంటారు. భక్తులు ఇచ్చిన కానుకలను లెక్కగట్టుకోవడమే తప్ప, ఆలయాల నిర్వహణపై ఏమాత్రం దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా

ప్రస్తుతం ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాను. స్థానికంగా ఉన్న ఆలయాల నిర్వహణ ఈఓ చూస్తుంటారు. ప్రత్యేకంగా ఏదైనా సమస్య తన దృష్టికి వస్తే పరిష్కరిస్తాను.

– సుమనప్రియ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా.

కొత్తగా వచ్చాను.. అన్నీ పరిష్కరిస్తా..

తాను నెల కిందటే ఇక్కడ తొలిసారిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించాను. నా పరిధిలోని అన్ని ఆలయాల్లో సమస్యలను ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. అన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తాను. భక్తులు సహకరించాలని కోరుతున్నాను.

– పి.జయకృష్ణ, కార్యనిర్వహణాధికారి, గ్రూప్ టెంపుల్స్, పుత్తూరు.



ఈశ్వరాలయం ఆవరణలో వ్యర్థాలు నిలిచిన ప్రదేశం, దుర్గంధం పక్కనే పరివార దేవతల ఆలయాలు, భూగర్భ ట్యాంకు నిండిపోయి బయటకు పారుతున్న మురుగునీరు, ఆరేటమ్మ ఆలయం

ఏరువాక ప్రదర్శన



మారుతున్న కాలానుగుణంగా రైతులు వ్యవసాయంలో నూతన వంగడాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని ఎస్‌వీ వ్యవసాయ కళాశాల తిరుపతి ప్రొఫెసర్ రెడ్డిరాము పిలుపునిచ్చారు. మండలంలోని 35 యర్లంపల్లెలో బుధవారం చిత్తూరు ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లావణ్య ప్రారంభించారు. లావణ్య మాట్లాడుతూ రైతులు సాంకేతిక పద్ధతులు, అధిక దిగుబడి ఇచ్చే నూతన విధానాలు అనుసరించాలని తెలిపారు. తద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. వ్యవసాయ ప్రదర్శనలో టెర్రస్ గార్డెన్, బయోగ్యాస్ ప్లాంట్, హైడ్రోపోనిక్స్, డ్రిప్ పద్ధతి, వర్మీ కంపోస్ట్, వివిధ రకాల మల్చింగ్ గురించి విద్యార్థులు వారి ప్రదర్శనల ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ సేవా పథకం వారం రోజుల పాటు విజయవంతంగా ముగియడంతో ఈ కార్యక్రమానికి సహకరించిన రైతులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

– ఐరాల



వ్యవసాయ ప్రదర్శనలో నమూనాలను తిలకిస్తున్న పాఠశాల విద్యార్థినులు

నూతన ఆరంభం.. ఆధ్యాత్మికం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు, సాయిబాబా ఆలయంలో బారులు తీరిన భక్తులు, ఏకాంబరకుప్పం సుబ్రమణ్య స్వామి ఆలయంలో భక్తుల సందడి

- ఆలయాల్లో విశేష పూజలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



విజయపురం : చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, వాక్య సందేశమిస్తున్న పాస్టర్ చంద్రశేఖర్

నగరి : కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. అవి నెరవేరాలి.. అంతా శుభం జరగాలి దీవించు స్వామీ... అంటూ భక్త జనం వేడుకున్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బుధవారం పట్టణ పరిధిలోని ఆలయాలు కళకళలాడాయి. టీటీడీ ఆధీనంలోని కరియమాణిక్య స్వామి ఆలయంలో వేకువజామునుంచే భక్తుల తాకిడి మొదలైంది. ఆలయం వద్ద ప్రత్యేకంగా నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు విక్రయించారు. ప్రత్యేక క్యూలను ఏర్పాటుచేసి భక్తులకు ప్రవేశం కల్పించారు. రాజీవ్ నగర్ కొండపై ఉన్న షిర్డీ సాయి దివ్యధామం భక్తులు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. నడక, వాహన మార్గాల్లో భక్తులు అధికంగా కనిపించారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని సాయినాథుని ప్రత్యేకంగా అలంకరించారు. దీపపు హారతి, కాగడ హారతి పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే ప్రధాన ఆలయం , ధ్యానమందిరంతోపాటు పరివార దేవతలైన విఘ్నేశ్వర స్వామి, గాయత్రీ దేవి, దక్షిణామూర్తి, సుబ్రమణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. టీటీడీ ఆధీనంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయంలోనూ భక్తులు అధిక సంఖ్యలో దర్శనమిచ్చారు. దేశమ్మ దేవాలయం, ఓంశక్తి ఆలయం, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, ఏకాంబరకుప్పం సుబ్రమణ్యస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో కనిపించారు. నూతన వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటుచేసిన రంగుల రాట్నాలు, స్లైడ్‌లు చిన్నారులను ఆనందపరిచాయి.

వేకువ జామునే ప్రార్థనలు

పట్టణ పరిధిలోని సెయింట్ మేరీ చర్చిలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వేకువజామునే క్రైస్తవసోదరులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని వేడుకున్నారు.

నూతన సంవత్సర వేడుకలు

విజయపురం : మండలంలో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. అప్పలాయిగుంట శ్రీ ప్రసన్న ప్రసన్నవేంకటేశ్వర స్వామి ఆలయంలో వేకువజాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వద్ద ప్రత్యేకంగా నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు విక్రయించారు. ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేసి భక్తులకు స్వామి వారి దర్శన ప్రవేశం కల్పించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, కేక్ కట్ చేశారు.



సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు, రంగుల రాట్నాలలో ఆడుకుంటున్న చిన్నారులు, బుగ్గదేవాలయం వద్ద భక్తుల సందడి

ఆలయాలు కిటకిట



సాయిబాబా ఆలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి

కార్వేటినగరం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధం ఆలయమైన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంతోపాటు స్థానిక బాలాజీ నగర్‌లో ఉన్న షిరిడీసాయిబాబా మందిరం, తంగమేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవీ, సుద్దగుంట సమీపంలోని సదాశివేశ్వరస్వామి, చాకలివాని గుంట వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి, సురేంద్రనగరంలోని వరద వేంకటేశ్వరస్వామి ఆలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి.

సాయినాథుని సేవలో కృపాలక్ష్మి

మండల కేంద్రంలోని సాయిబాబాను వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గం సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మి, ఆలయ అధ్యక్షుడు బాలాజీ, ఎంపీపీ లత దంపతులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనంజయవర్మ, ఉపసర్పంచ్ శేషాద్రి, దామోదరం, సుబ్రమణ్యం, చిరంజీవిరెడ్డి, పయణిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ పురంలో..

శ్రీరంగరాజపురం : ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా బుధవారం మండలంలోని ఆరిమాని గంగమ్మ ఆలయం, ఆత్మలింగేశ్వరస్వామితోపాటు కొటార్లపల్లి, సింధురాజపురం, పుల్లూరులోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలోని విశేష పూజలు చేశారు. నిర్వాహకులు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

పాలసముద్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ అరుణ కుమారి రెవెన్యూ సిబ్బందితో కలసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సరంలో అందరు సంతోషంగా ఉండాలని పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్‌ఐ దేవి, డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, మండల సర్వేయర్ గణేష్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆలయాల్లో రద్దీ

గంగాధర నెల్లూరు: నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా మండలంలో పలు ఆలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని అల్లి ఎల్లమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు ఆనంద అయ్యంగార్ ఆధ్వర్యంలో అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

కృపాలక్ష్మికి శుభాకాంక్షలు

వైఎస్సార్ సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మికి పలువురు నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుత్తూరులోని మాజీ మంత్రి కార్యాలయంలో కృపాలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువలు కప్పి సన్మానించారు.

నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే థామస్

గంగాధర నెల్లూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే థామస్ పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

పారిశుధ్యం.. ఆదాయం

- పంచాయతీకి ఆదాయం పెంచండి
- సర్పంచ్ గాలి మహేష్ బాబు సూచనలు



బ్యాటరీ సహాయంతో చెత్త సేకరణ వాహనానికి పూజచేసి ప్రారంభిస్తున్న సర్పంచ్

పాలసముద్రం : గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని సర్పంచ్ గాలి మహేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ సూచించారు. ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం శ్రీకావేరిరాజుపురంలో గ్రీన్ అంబాసిడర్ల గ్రామాల్లో పర్యటించి తీసుకొస్తున్న చెత్తను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సత్యనారాయణ మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారుచేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. చెత్తను సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి, వానపాములు వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల ప్రకారం విక్రయించి పంచాయతీకి ఆదాయం పెంచాలన్నారు. అనంతరం బ్యాటరీ సహాయంతో చెత్త సేకరణ వాహనానికి పూజచేసి ప్రారంభించారు. కార్యక్రమంతో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన అర్ధగిరి క్షేత్రం

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం బుధవారం నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం స్వామిని గంధం , సుగంధ పరిమళ పుష్పాలు, తమలపాకులతో అలంకరించి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించి ధూపదీప నైవేద్యం సమర్పించారు. ఉదయం నుంచే భక్తుల తాకిడి మొదలైంది. దీంతో అరగొండ క్షేత్రం రద్దీగా మారింది. క్రమంతో భక్తులు తరలిరావడంతో ఆలయంలో క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులు కూలల్లో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. అయినా నూతన సంవత్సరం ఆరంభం సందర్భంగా అర్ధగిరి హనుమంతుడిని దర్శించుకుంటే విజయాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలోనే అర్ధగిరికి భక్తులు పోటెత్తారు. గంటల తరబడి క్యూలలో నిరీక్షించి స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. అనంతరం ప్రసాదం కోసం కౌంటర్ వద్దకు వెళ్లిక భక్తులకు నిరాశ ఎదురైంది. అక్కడ భక్తులందరికీ సరిపడా ప్రసాదాలు అందుబాటులో లేవు. దీంతో అక్కడ రద్దీ పెరగడంతో తోపులాటకు దారితీసింది. కొందరు భక్తులు నిరీక్షించే ఓపిక లేక వెనుదిరిగారు. ఈ క్రమంలోనే పులిహోర ప్రసాదాల కౌంటర్ దగ్గర స్వల్పంగా తోపులాట చోటుచేసుకుంది. వెంటనే స్పందించిన ఆలయ ఈఓ హనుమంతరావు ప్రసాదాలు అందుబాటులోకి తెచ్చి భక్తులకు అందజేశారు. ఆ తరువాత ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు.